ప్రజాశక్తి

ఆదివారం 4 డిసెంబర్ 2022 5

పార్వతీపురం మన్యం



ధాన్యాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ



కళ్లాల్లో ధాన్యం పరిశీలిస్తున్న ఆర్‌డిఒ హేమలత


సీతానగరం : మండలంలోని కాశీపేటలో కళ్లాలో ఉన్న ధాన్యాన్ని ఆర్‌డిఒ కె.హేమలత శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం నాణ్యతను గురించి ఎఒను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలన్నారు. ఆర్‌బికెల ద్వారా ధాన్యాన్ని సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఎఒ ఎస్.అవినాష్, తహశీల్దార్ ఎంవి రమణ, ఆర్‌ఐ సిహెచ్ రాజేష్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

- పట్టణంలో విద్యార్థుల ర్యాలీ
- ప్రభుత్వ విధానాలతో విద్యారంగానికి నష్టం
- బహిరంగ సభలో వక్తలు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు



అభివాదం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


ప్రజాశక్తి–బొబ్బిలి

ఎస్ఎఫ్ఐ జిల్లా 30వ మహాసభలు శనివారం బొబ్బిలి పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి తాండ్ర పాపారాయ విగ్రహం జంక్షన్ వరకు విద్యార్థులు నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.విజయగౌరి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి విధానాలతో విద్యా రంగానికి తీవ్ర నష్టం జరుగుతోందని అన్నారు. విజయగౌరి మాట్లాడుతూ పోరాటాల గెడ్డ బొబ్బిలిలో ఎస్ఎఫ్ఐ 1983లో ఏర్పడిందన్నారు. చదువుతూ పోరాడు చదువుకై పోరాడు నినాదంతో ఎస్ఎఫ్ఐ పని చేస్తోందన్నారు. రాజా కళాశాలను ఎయిడెడ్ నుంచి ప్రైవేటీకరణ చేయడం అన్యాయమన్నారు. బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా రంగంలోకి పాలకులు మతత్వాన్ని జొప్పిస్తున్నారని, ఇటువంటి విద్యార్థులంతా తిప్పికొట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న బైజూస్ యాప్‌తో విద్యారంగానికి తీవ్ర నష్టమన్నారు. విద్యారంగ సమస్యలపై భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ జాతీయ నూతన విద్యా విధానాన్ని అమలు చేయకపోయినా రాష్ట్రంలో సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేసి ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ పిజి కోర్సులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ జ్యూట్ మిల్లు మూతతో పిల్లలను చదివించుకునే స్తోమత లేక తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన సకాలంలో ఇవ్వడం లేదన్నారు. బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీ, బహిరంగ సభలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ పావని, తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు అశోక్

అనంతరం ఎస్ఎఫ్ఐ మహాసభ గంటి ప్రసాదం భవనంలో ప్రారంభమైంది. తొలుత ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ ఎగురవేశారు. అనంతరం ప్రతినిధుల సభ ప్రారంభం కాగా, అధ్యక్ష వర్గంగా నాయకులు సిహెచ్ వెంకటేష్, ఎం.సౌమ్య, రామకృష్ణ, వి.చిన్నబాబు వ్యవహరించారు. ముఖ్య అతిధిగా హాజరైన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను ఎన్ఇపి పేరుతో పూర్తిగా తన చేతిలోకి తీసుకొని విద్యను కార్పొరేటీకరణ, కాషాయికరణ చేసే దుర్మార్గమైన పోకడలకు పోవడం అన్యాయమని అన్నారు. దేశంలో జాతీయ విద్యా విధానాన్ని ఎక్కడ అమలు చేయకపోయినా మన రాష్ట్రంలో మాత్రం వేగంగా అమలు చేస్తున్నారు. దానిలో భాగంగానే స్కూల్స్ మూసివేత, డిగ్రీ ఇంటర్న్‌షిప్ తేవడం అన్నారు. గతంలో ఇంట్లో అందరికీ స్కాలర్‌షిప్ వచ్చేదని, ఇప్పుడు అమ్మఒడి అమలు ఒక్కరికి మాత్రమే వర్తిస్తుందని అన్నారు. దీనివల్ల పేద విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ఇటువంటి విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులంతా పోరాడాలని పిలుపునిచ్చారు. నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి, విశాఖ ఉక్కును ప్రయివేటు చెయ్యొద్దని, బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని తీర్మానాలు చేశారు.



యంత్రంతో వరి కోయిస్తూ నూర్పు చేయిస్తున్న రైతు

యంత్రాలతో పనులు... కూలీలకు పస్తులు

వ్యవసాయ కార్మికులకు తప్పని వలసలు

ప్రజాశక్తి – జియ్యమ్మవలస

వ్యవసాయ పనుల్లో యంత్రాల వినియోగంతో పనులు దొరక్క కూలీలు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరి కోతల సీజన్ కూలీలకు కొంత ఊరటనిస్తుంది. అయితే పెరుగుతున్న యాంత్రీకరణతో కూలీలకు పనులు దొరక్క అవస్థలు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయి. వరి కోత యంత్రాలు రావడంతో రైతులు పండించే వరి చేను కోతలకు కూలీల అవసరం లేకుండా పోతున్నది. అలాగే నూర్పిడి సులభతరం కావడంతో రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు.

మండలంలో సుమారు 16 వేల హెక్టార్లలో వరి సాగవుతోంది. రెండు మూడు నెలలుగా కూలీ నాలీ లేని కూలీలకు వరి కోతలు కొంత ఊరట నివ్వాల్సి ఉండగా యంత్రాల పుణ్యమా అని కూలి లేక ఆకలితో అలమటించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఎకరా పొలం గంటకు యంత్రం కోసేస్తున్నది. కూలీలకు ఒక ఎకరాకు రూ.2500 కోతకు ఇవ్వాల్సి వస్తుంది. మోతకు, నూర్పిడికి మరో రూ.4వేలు ఎకరానికి ఖర్చు చేయాల్సి వస్తున్నది. నూర్పిడి యంత్రంతో ఆ ఖర్చు రూ.3వేలుకు తగ్గిపోవడంతో రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. 80 శాతం మంది రైతులు వరి నూర్పుడి యంత్రాలను వినియోగిస్తున్నారు. దీంతో వేలాదిమంది వ్యవసాయ కార్మికులు కూలి కరువై ఆకలితో అలమట్టించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. యాంత్రీకరణ ఒకవైపు మేలు జరుగుతున్నా మరోవైపు కూలీలకు ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. ఉపాధి లేక మూడు నెలలుగా పనులు కోసం ఎదురుచూస్తున్న కూలీలకు వరి కోత యంత్రాలు గండి కొడుతున్నాయి.



వర్ధమాన గాయకుడ్ని సన్మానిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఘనంగా జగనన్న స్వర్ణోత్సవ సంబరాలు

గాయకులు, ప్రముఖులకు సత్కారం

ప్రజాశక్తి – సాలూరు

మధుర గాయకుడు ఘంటసాల, సంగీత దర్శకుడు సాలూరు రాజేశ్వరరావు, నటసార్వభౌమ ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు, జగనన్న స్వర్ణోత్సవ సంబరాలు సందర్భంగా శనివారం ప్రముఖ వర్ధమాన గాయకులు, పట్టణ ప్రముఖులను డిప్యూటీ సీఎం రాజన్నదొర ఘనంగా సన్మానించారు. స్థానిక రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఘంటశాల సంగీత కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ శరత్ చంద్రతో పాటు ఆయన బృందం గాయకులను, కబీర్‌షా ఆర్కెస్ట్రా నిర్వాహకులు బాషా, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.మోహనరావు, డాక్టర్ వి.గణేశ్వరరావు, సాలూరు మిత్ర బృందం వ్యవస్థాపక అధ్యక్షులు జెబి తిరుమలాచార్యులు, అధ్యక్షులు రావాడ కృష్ణకుమారి, భాస్కరరావును సన్మానించారు. వైసిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యదర్శి జర్జాపు ఈశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఘంటశాల, సాలూరు రాజేశ్వరరావు స్వరపరిచిన మధుర గీతాలాపనలతో కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, ఎన్టీఆర్ అభిమానసంఘం అధ్యక్షులు కస్తూరి రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు నిఘా

ప్రజాశక్తి – కలెక్టరేట్

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు నిఘా పెంచాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదరహిత జిల్లాగా పేర్కొందాలని అన్నారు. ఇందుకు రవాణా, పోలీస్ శాఖలు నిఘా పెంచాలన్నారు. అధిక లోడ్, వేగంగా డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ ధరించక పోవడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, సీట్ బెల్ట్ వినియోగించకపోవడం, తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని నిఘా, పర్యవేక్షణ చేయాలని ఆయన సూచించారు. 15 రోజుల్లో పరిస్థితి మెరుగు కావాలని ఆదేశించారు. విద్యా సంస్థల్లో రహదారి భద్రతపై అవగాహనా సదస్సులు చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రధాన రహదారుల మెరుగుకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. గోశాలల ఏర్పాటుకు స్థలాలను జాయింట్ కలెక్టర్ గుర్తిస్తారని చెప్పారు. జిల్లా రవాణా అధికారి ఎం.శశికుమార్ మాట్లాడుతూ రహదారి భద్రతా మాసోత్సవాలు వచ్చే వారం నుంచి చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ట్రామా కేర్ కేంద్రం ఏర్పాటుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గుర్తించి ప్రతిపాదన లు సమర్పించారని చెప్పారు. ఆర్అండ్‌బి ఇఇ ఎం.జేమ్స్ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర రహదారుల పనులు 12, జిల్లా ప్రధాన రహదా రుల పనులు 10 జరుగుతున్నాయని, జనవరి నాటికి పనులు పూర్తి అవుతాయని చెప్పారు. సీతానగరం బ్రిడ్జి పనులు దాదాపు 50 శాతం వరకు పూర్తయ్యాయని అన్నారు. రహదారి భద్రత కమిటీలో సూచనల మేరకు రూ.39.60 లక్షలతో ప్రతిపాదనలు సమర్పించామని చెప్పారు. ఐఆర్ఎడి పోర్టల్‌లో ప్రమాదాల వివరాలు అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. అక్టోబర్‌లో 21 ప్రమాదాలు జరిగ్గా, ఆరుగురు మృతి చెందారని, 32 మందికి గాయాలయ్యాయని చెప్పారు. 2020 నవంబరులో 22 ప్రమాదాలు జరగ్గా 4 మంది మృతి చెందారని, 35 మంది గాయపడ్డారని, 2021 నవంబరులో 23 ప్రమాదాల్లో 9 మంది మృతి చెందారని, 21 మంది గాయపడ్డారని తెలిపారు. జిల్లా ఆవిర్భావం తర్వాత1131 కేసులను నమోదు చేశామని ఆయన వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, డిఎస్‌పిలు ఎ.సుభాష్, జివి కృష్ణారావు, ఆర్‌టిఒ టి.వి.ఎస్.సుధాకర్, రవాణా సంఘం అధ్యక్షులు జి.వి.రమణ, డిఐఒ టి.జగన్మోహన రావు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

బస్సు ఎక్కాలంటే కుస్తీ పట్టాల్సిందే

ప్రజాశక్తి – భామిని

మండల కేంద్రంలో ప్రతి రోజూ బస్సు కోసం వివిధ పాఠశాలలు, కాలేజీ విద్యార్థులు పడి గాపులు కాయాల్సి వస్తోంది. తీరా బస్సు వచ్చాక ఎక్కడానికి పోటీ పడాల్సి వస్తుంది. ఈ బస్సులు ఎక్కే క్రమంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ, గాయాలు పాలవుతున్నారని తల్లిదండ్రులు తెలుపుతున్నారు. సాయంత్రం వేళలో ఒకటి, రెండు బస్సుల్లో వందలా మంది విద్యార్థులు ప్రయాణించాల్సి వస్తుంది. ఇదే కాకుండా భామిని అంబేద్కర్ కూడలి నుంచి బస్సు ఎక్కడానికి విద్యార్థులు పరుగులు పెట్టాల్సివస్తుంది. ఇలా ప్రతీ రోజూ జరగడంతో విద్యార్థులకు ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.



బస్సు ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

కొమరాడ : వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభలు జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి శివున్నాయుడు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులకు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. శనివారం మహాసభల వాల్‌పోస్టర్‌ను కొమరాడలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలు ఈనెల 8,9,10 తేదీల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరుగుతాయన్నారు. ఈ మహాసభలకు వ్యవసాయ కార్మికులంతా పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాము, లక్ష్మణరావు, అప్పలనాయుడు, పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు

పార్వతీపురంటౌన్ : జగనన్న లే అవుట్‌లో బిల్లులు పడని లబ్ధిదారులకు చెల్లింపులు జరిపేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు హౌసింగ్ అధికారులను ఆదేశించారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం స్థానిక ఆశాజ్యోతి ఆశ్రమం దగ్గరలో ఉన్న పార్వతీపురం –సి లేఔట్‌ను ఆయన హౌసింగ్, మున్సిపల్ ఇంజినీరింగ్, సచివాలయాల ఇమ్యూనిటీ సెక్రటరీలతో కలిసి సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడగా లే అవుట్‌లో రహదారి సౌకర్యం లేదని, విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయని, పలువురికి బిల్లులు చెల్లించలేదని తెలిపారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ రహదారి పనులు రెండు రోజుల్లో ప్రారంభిస్తామని, విద్యుత్ స్తంభాల సమస్యలను ఆ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఇళ్లు నిర్మించని లబ్ధిదారులు తొందరగా నిర్మించుకోవాలని సూచించారు.

జిల్లాకు అవార్డులు వరించాలి : కలెక్టర్

కలెక్టరేట్: జిల్లాకు అవార్డులు వరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. నీతి అయోగ్ 'అభిలషణీయమైన (ఏస్పిరేషనల్) జిల్లాల' జాబితాలో పార్వతీపురం మన్యం జిల్లా ఉండటం శుభ సూచకమని ఆయన చెప్పారు. ఈ మేరకు వివిధ అభివృద్ధి శాఖల అధికారులతో శనివారం ఆయన తన కార్యాలయంలో సమావేశమయ్యారు. అభిలషణీ యమైన జిల్లాల పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై అవార్డులకు దరఖాస్తు సమర్పించే అవకాశం ఉందని వాటి వివరాలు అధ్యయనం చేసి సమర్పించాలని ఆయన ఆదేశించారు. దరఖాస్తులో పొందుపరచిన వివరాలను కేంద్ర ప్రభుత్వ అధికారులు, రాష్ట్రంలో వివిధ విభాగాల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల స్థాయిలో క్షేత్ర స్థాయిలో పరిశీలన ఉంటుందని ఆయన తెలిపారు. ప్రతి అంశాన్ని స్పష్టంగా అవగాహన పొంది పూర్తి అర్హత ఉన్నప్పుడు మాత్రమే సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బిసిలకు ప్రాధాన్యత ఇచ్చింది వైసిపియే : రాజన్నదొర

ప్రజాశక్తి –సాలూరు

రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా బిసిలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఏకైక ప్రభుత్వం వైసిపిదేనని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. శనివారం వైసిపి బిసి నాయకులతో కలిసి తన నివాసంలో జయహో బిసి మహాసభ గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలో వచ్చిన తర్వాత రాష్ట్రానికి బిసిలు వెన్నెముక లాంటివారని గుర్తింపు తెచ్చిందన్నారు. 56బిసి కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఛైర్మన్లు, డైరెక్టర్ పదవులిచ్చి రాజకీయాల్లో అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. ఈనెల 7న విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో జయహో బిసి మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు జిల్లా నలుమూలల నుంచి బిసి ప్రజాప్రతినిధులంతా సభకు హాజరు కావాలని కోరారు. పంచాయితీ వార్డు మెంబర్ నుంచి పార్లమెంట్ మెంబర్ వరకు బిసి నాయకులు హాజరు కావాలన్నారు. 6న సాయంత్రం నియోజకవర్గం నుంచి బస్సుల్లో బయలుదేరాలని చెప్పారు. మహాసభకు హాజరు కాని నాయకులపై పార్టీ నిఘా వర్గాలు దష్టి సారిస్తాయని చెప్పారు. ఎంతమంది బయలు దేరతారో చెపితే ముందుగా బస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వంగపండు అప్పలనాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ, శ్యామలాంబ కోపరేటివ్ స్టోర్స్ ఛైర్మన్ మేడిశెట్టి అప్పలనాయుడు, కౌన్సిలర్ రాపాక మాధవరావు,మండలవైస్ ఎంపిపి రెడ్డి సురేష్,మెంటాడ నాయకులు రెడ్డి ఈశ్వరరావు,సన్యాసి నాయుడు, వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

7న జయహో బిసి మహాసభను జయప్రదం చేయండి



బిసి మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజన్నదొర, బిసి సంఘాల నాయకులు

జియ్యమ్మవలస : బిసి మహాసభను జయప్రదం చేయాలని కురుపాం ఎమ్మెల్యే పి. పుష్ప శ్రీవాణి పిలుపునిచ్చారు. శనివారం చినమేరంగిలోని తన నివాసంలో బిసి నేతలతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవాడలో నిర్వహిస్తున్న బీసీ మహాసభకు నాయకులు కార్యకర్తలు హాజరై నియోజకవర్గ కీర్తి ప్రతిష్టలు పెంచాలని సూచించారు.

పార్వతీపురంటౌన్ : విజయవాడలో జరగనున్న "జయహో బిసి మహాసభ – వెనుకబడిన కులాలే వెన్నెముఖ" సభను విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు నియోజకవర్గం బిసి నాయకులకు పిలుపునిచ్చారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని బిసి ప్రజా ప్రతినిధులు, నాయకుల సమక్షంలో జయహో బిసి మహాసభకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని బిసి నాయకులు, మూడు మండలాల, పట్టణ పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్లు, నియోజకవర్గ బిసి సంఘాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

పరస్పర విమర్శలు.. రాజకీయ విన్యాసాలు

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

'రాజకీయాలను జనం పట్టించుకోకపోయినా, రాజకీయాలు మాత్రం జనం జీవితాలను ప్రభావితం చేస్తునే ఉంటాయి. కానీ, ఆ రాజకీయాలు జనాలకు సంబంధం లేకుండా సాగిపోతే, అటువంటివాటిని ప్రజలు కూడా పట్టించుకోరు. అట్టి రాజకీయాలు ఇప్పటికిప్పుడు కొంత గందరగోళానికి, మభ్యపెట్టడానికి సంబంధిత రాజకీయ పార్టీలకు, నేతలకు ఉపయోగపడవచ్చు. కానీ, ఆచరణలో ఇటువంటి రాజకీయ విన్యాసాలు సాగబోవు'. ఇదీ గడిచిన నాలుగైదు రోజులుగా జిల్లాలో సాగతున్న పబ్లిక్‌టాక్. జిల్లాలో ఇటీవల కాలంలో సాగిన జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఈనెల 29న వచ్చిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఆ మరునాడు వచ్చిన ఎస్‌సి సంక్షేమ కమిటీ ఛైర్మన్ గొల్లబాబురావుల పర్యటనలపై అచ్చంగా అటువంటి విమర్శలే వినిపిస్తున్నాయి. గృహ నిర్మాణంలో ప్రభుత్వం అవినీతి బాగోతం వెలికితీత, లబ్ధిదారులు ఇబ్బందుల పేరిట గుంకలాం జగనన్న కాలనీకి పవన్ కల్యాణ్ రాగా, నాలుగు రోజుల క్రితం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కూడా జిల్లాలోని ఎమ్మెల్యేలు, పార్టీ నాయలు, ఇతర ప్రజాప్రతినిధులను వెంటబెట్టుకుని అదే కాలనీని సందర్శించారు. ఇద్దరి పర్యటనలోనూ లబ్ధిదారులకు మేలు చేసేదానికన్నా రాజకీయ విన్యాసాలే ప్రదర్శించారని జనం చర్చించుకుంటున్నారు.

పవన్ రాక నేపథ్యంలో పాపం ఆ పార్టీ నాయకులు లబ్ధిదారులను కూడబెట్టి మండుటెండలో కూర్చోబెట్టారు. సమస్యలు చెప్పుకుందామనో, సినీస్టార్‌తో ముఖాముఖీ అవకాశం దక్కుతుందనో దాహానికి ఓర్చి మరి ఎదురెండలో గంటల తరబడి నిరీక్షించారు. తీరా పవన్ వచ్చాక కారుదిగక్కుండానే మాట్లాడి వెళ్లిపోవడంతో లబ్ధిదారుల ఆగ్రహ ఆవేశాలు కట్టలు తెంచుకున్నాయి. ఈ పాటిదానికి ఇంతసేపు ఎందుకు ఇబ్బందిపెట్టాలా? అంటూ కసరుకున్నారు. నాయకులు వారికి సమాధానం చెప్పుకోలేక చిన్నబోవాల్సిన పరిస్థితి కనిపించింది. మరోవైపు గృహ నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న

పబ్లిక్ టాక్

సొమ్ము సరిపోందంటూ వ్యాఖ్యానించారు. దీంతో, 'అబ్బా' పవన్‌కు ఇన్నాళ్ల వరకు ఈ విషయం బోదపడలేదా? అంటూ పలువురు చర్చించుకున్నారు. భూమి కొనుగోలులో రూ.కోట్ల అక్రమాలు జరిగాయని కూడా ఆరోపించారు. కానీ, ఇంత పెద్దకాలనీకి వచ్చిన ఆయన అక్రమాలు, అవినీతి బాగోతాలు ఎలా? ఏ రూపాల్లో జరిగాయో చెప్పలేదు. అందుకు బాధ్యులు ఎవరనేది ప్రస్తావించలేదు. దీన్ని అవకాశంగా తీసుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు అవినీతి జరిగితే నిరూపించాలని సవాలు చేసినా జనసేనకు నాయకులకు పట్టలేదు. అధికార పక్షం సమర్థింపులు పక్కనబెడితే దొంగలు పడ్డ ఆరు నెలల వరకు చోరీ విషయం గుర్తుకు రాలేదన్నట్టుగా సుమారు రెండేళ్ల క్రితం కొనుగోలు చేసిన భూ వ్యవహారాలపై ఇప్పటివరకు నోరు మెదపని పవన్ ఇప్పటికిప్పుడు ఎందుకు ప్రస్తావించారనేది కొంతమంది నోట వినిపించింది. ఈ మాట కొస్తే టిడిపి హయాంలో గృహ నిర్మాణాలు పడకేశాయి. పేదలకు సెంటు భూమి ఇచ్చిన దాఖలాలు దాదాపు లేవు. ఈనేపథ్యంలో ఆ పార్టీ నాయకులు ఇళ్లు, ఇళ్ల స్థలాల విషయంలో వైసిపిని విమర్శించే నైతిక అర్హత కోల్పోయారు. ఈనేపథ్యంలో పవన్‌ను పావుగా వాడుకుని అధికార పార్టీపై విమర్శలు చేయిస్తుందని చాలా మంది చర్చించు కుంటున్నారు. ఇదిలా ఉంటే, గతనెల 29న జిల్లాకు వచ్చి అదే కాలనీని సందర్శించిన మంత్రి జోగి రమేష్ చేసిందేంటనేది ప్రతిపక్షం, జనసేనతోపాటు తటస్థంగావున్న వారి వాదన. హడావుడిగా వచ్చిన మంత్రి అధికారులు, ప్రజాప్రతిధులును వెంటబెట్టుకుని కాలనీలో పర్యటించారు. ఒక్కరంటే ఒక్క లబ్ధిదారుతోనూ మాట్లాడలేదు. సాదకబాధకాలు తెలుసుకోలేదు. సుమారు 11వేల స్థలాలు కలిగిన ఈ కాలనీలో పట్టుమని పాతిక ఇళ్లు కూడా పూర్తికపోయినప్పటికీ ప్రశ్నించలేదు. ఆహాఓహో అంటూ ప్రభుత్వాన్ని సమర్థించుకుంటూనే తిరిగి పవన్ కల్యాణ్‌ను విమర్శించడంతోనే సమయం సరిపెట్టారు. ఇటు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులతో చేపట్టిన సమీక్షా సమావేశంలోనూ ఇళ్ల నిర్మాణంలో వెనుకబాటుకుగల కారణాలపై లోతైన చర్చలేదు. ఉపన్యాసాలు, సన్మానాలు, సత్కారాలతో సమయం సరిపోయింది. ఈనెల 30జిల్లాకు వచ్చిన ఎస్‌సి సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కూడా క్షేత్ర స్థాయికి వెళ్లలేదు. అధికారులతో సమీక్షలతోనే సరిపెట్టడంతో దళితులు, దళిత సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఇటువంటి పర్యటనలపై జనం విమర్శలు గుప్పిస్తున్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

జిల్లా మహాసభను జయప్రదం చేయండి

సాలూరు రూరల్ : ఈ నెల 13,14 తేదీల్లో పార్వతీపురంలో నిర్వహించనున్న సిఐటియు జిల్లా మహాసభలను కార్మికులంతా జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎన్‌వై నాయుడు కోరారు. మండలంలోని తోణాంలో మహాజన సభ గోడ పత్రికను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవానికి ఈ నెల 3,4 తేదీలలో జరగాల్సిన సభలను 13,14 తేదిలకు మార్చామన్నారు. ఈ సభలలో కార్మికుల ఐక్యత గురించి, కార్మికులు సమస్యలు గురించి, భవిష్యత్‌లో చేపట్టబోయే ఉద్యమాలు గురించి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు గురించి, కార్మికులకు సంబంధించి అన్ని సమస్యలు గురించి చర్చించి నాయకులు దిశా నిర్దేశం చేస్తారని చెప్పారు. ఈ సభలకు అనుబంధ సంఘాలు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు నాయకులు సింహాచలం, తౌడు, పారమ్మా, సుజాత పాల్గొన్నారు.

ఎంఇఒ, డిప్యూటీ డిఇఒ పోస్టులు భర్తీ చేయాలి

పార్వతీపురంటౌన్ : ఖాళీగా ఉన్న ఎంఇఒ, డిప్యూటీ డిఇఒ పోస్టులను రెగ్యులర్ విధానంలో భర్తీ చేయాలని ఎపి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ పోస్టులను ఎఫ్ఎసి పద్ధతిలో అర్హత గల ప్రభుత్వ యాజమాన్య ప్రధానోపాధ్యాయులను అదనపు బాధ్యతలతో ఎంఇఒ, డిప్యూటీ డిఇఒ పోస్టుల్లో భర్తీ చేశారు. అయితే ఈ పోస్టులను రెగ్యులర్ విధానంలో భర్తీ చేయకపోవడం వల్ల జోడు పదవుల భారం ఎక్కువై, అటు ఎంఇఒ, ఇటు హైస్కూల్ హెచ్ఎంలుగా విధులను నిర్వర్తించడం కష్టంగా ఉన్నందున రెండు పోస్టులకు తగిన న్యాయం జరగడంలేదని అన్నారు. కావున వారిని ఒక పోస్టులో మాత్రమే రెగ్యులర్‌గా నియమించేలా చేసి, రెండో పోస్టులో ఫీడర్ కేడర్‌లో ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పిస్తే ఆ పోస్టులు భర్తీ అవుతాయని తెలిపారు.

గిరిజన గ్రామాలకు పక్కా రహదారులు వేయండి

పార్వతీపురం రూరల్ : గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ పక్కా రహదారులు నిర్మించాలని గిరిజనసంక్షేమ సంఘం నాయకులు తాడంగి సాయిబాబు, ఆరిక ప్రభాకరావు, ఉర్లక నాగార్జున, రాయల ఆనందరావు డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ గోచెక్క పంచాయతీ లిడికివలసలో 2 కిలోమీటర్లు, కొత్తలిడికివలస నుంచి టొంకి వరకు 2కిలోమీటర్లు, కొసరవానివలసలో సుమారు కిలోమీటరు, డి.కె పట్నం పంచాయతీ తాడంగి వలస, బొడ్డవలస కిలోమీటరు చొప్పున, అడారు పంచాయతీలో గుడారి వలస, జిల్లేడువలస 1/2కిలోమీటర్ల ఒడిశా సరిహద్దు వరకు రోడ్డు వేసి కల్వర్టు వేయాలని కోరారు. అటు ఒడిశా ప్రభుత్వం నారాయణ పట్నం నుంచి ఆంధ్రా సరిహద్దు జిల్లేడువలస వరకు డబుల్ లైన్ రోడ్డు వేస్తున్నారని, కావున జిల్లేడువలస రోడ్డు కల్వర్టు పూర్తి చేస్తే ఆంధ్రా-ఒడిశా రవాణా వాణిజ్య సౌకర్యం సులభతరం అవుతుందని అన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

ధాన్యం కొనుగోలుపై అవగాహన

పార్వతీపురం రూరల్ : ధాన్యం కొనుగోలుపై రైతులకు పూర్తి అవగాహన కలిగించే బాధ్యత అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు తీసుకోవాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుపై సరైన అవగాహన లేక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. మద్దతు ధర, తేమశాతం, రవాణా చార్జీలు, బిల్లుల చెల్లింపులు వంటి వాటిపై ముందుగానే వారికి తెలియపరచాలన్నారు. అనంతరం మండల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, వైస్ చైర్‌పర్సన్ ఎం. భాగ్యలక్ష్మి, ఎంపిడిఒ ఆకిబ్ జావేద్, సూపరింటెండెంట్ ఎలవి అప్పారావు, ఇఒపిఆర్‌డి కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సభ నిర్వహిస్తున్న తహశీల్దార్ మాధవి

రైతులందరికీ న్యాయం చేస్తాం

ప్రజాశక్తి - వీరఘట్టం

రైతులందరికీ న్యాయం చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు స్థానిక తహశీల్దార్ జల్లేపల్లి మాధవి రైతులకు సూచించారు. మండలంలోని పాస్‌పెన్నపురం సచివాలయం పరిధిలో గల కొండ గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామసభను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు పత్రం అందించడంలో భాగంగా గ్రామంలో సమగ్ర భూ సర్వేలో రైతులందరికీ న్యాయం చేసేలా ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలోని 1344.56 ఎకరాల్లో 356మంది రైతులకు సంబంధించి భూరి సర్వే చేశామన్నారు. హెచ్చుతగ్గులు ఉంటే సరి చేస్తామని రైతులు అపోహలు చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.కృష్ణారావు, జి.ప్రసాదరావు, విఆర్ఒ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.



ధాన్యం తూచే యంత్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఎస్.రమేష్

సిబ్బందికి అవగాహన అవసరం

కొమరాడ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి అవగాహన ఉండాలని ఎంపిడిఒ ఎస్ రమేష్ అన్నారు. శనివారం గుణానపురం, అర్థం సచివాలయం వాలంటీర్లతో ఆయన సమావేశమయ్యారు. రైతులు ధాన్యాన్ని నూర్పులు చేసిన వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకులకు సమాచారం ఇస్తే వారు వచ్చి రైతు ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా ధాన్యం ఉంటే వెంటనే రైతుకు కళ్లే బస్తాలు అందజేస్తారని తెలిపారు. మిల్లుకు ధాన్యం చేరిన వెంటనే రైతు ఖాతాలో నగదు జమవుతాయని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో సచివాలయం కార్యదర్శులు సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

పరుశురాంపురం ఆర్‌బికె తనిఖీ

రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఎంపిడిఒ రమేష్ అన్నారు. శనివారం పరుశురాంపురం రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రైతు భరోసా కేంద్రంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బంది విధులు హాజరవుతున్న తీరుపై ఆరా తీశారు.

వికలాంగుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

ప్రజాశక్తి - సీతానగరం

వికలాంగుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, రాయితీలను సద్వినియోగం చేసుకుని ఆత్మస్థైర్యం నింపుకోవాలని ఎంఇఒ జి.సూరిదేముడు అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక భవిత కేంద్రంలో ఎంఇఒ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ వికలాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, రాయితీ లను వివరించారు. సహిత విద్యా ఉపాధ్యాయులు పి.కృష్ణమోహనరావు మాట్లాతూ వికలాంగ విద్యార్థులను ప్రతి మంగళవారం భవిత కేంద్రానికి తల్లిదండ్రులు తీసుకొచ్చి ఫిజియోథెరపీ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంవి రమణ, ఎపిఎం, సహిత విద్య ఉపాధ్యాయులు రేణుకాదేవి, పైడిరాజు, భానుప్రసాద్, సిఆర్‌పిలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

పార్వతీపురం రూరల్ : స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఎంఇఒ పివి ప్రసాద్ చర్చి వీధి మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని



సీతానగరం: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు, నాయకులు

వికలాంగుల తల్లిదండ్రులు ప్రతిరోజు కేంద్రానికి తీసుకురాగలిగితే తప్పకుండా పూర్తి ప్రయోజనం పొందగలరని అన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు తిరుమలదేవి, బి.రమణ, సీజీవి గీత తదితరులు పాల్గొన్నారు.

భామిని : జీవితంలో ఎదుగుదలకు అంగవైకల్యం అడ్డుకాదని, ఆత్మస్థైర్యమే వికలాంగులకు ఆయుధమని స్థానిక ఉన్నత పాఠశాల ఇంచార్జి హెచ్ఎం కలిశెట్టి విజయ్, శ్రీరామ్ అన్నారు. భామిని భవిత సెంటర్‌లో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలిపొందిన వికలాంగ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి టి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వెంకటభైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ మరడ వెంకటరత్నం చేతుల మీదుగా ఎంఎస్ఆర్ ఫౌడేషన్ సౌజన్యంతో వికలాంగ విద్యార్థులకు దుప్పట్లు, భోజనం ప్లేట్లు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లు పద్మావతి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ఎంఎస్ఆర్ యూత్ పాల్గొన్నారు.

సాలూరు: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సూర్యమహల్ ఆవరణలో మదర్ థెరిస్సా దివ్యాంగుల సంక్షేమ సంఘం, రాజరాజేశ్వరి మహిళా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో వందమంది వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మదర్ థెరిస్సా వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జిల్లెల్ల సీతారాం మాట్లాడుతూ వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. సిడిసి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఎస్.అన్నపూర్ణ, రిస్పాన్ ప్రతినిధి రవీంద్రన్ చేతులు మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా రామాకాలనీలోని భవిత కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎన్.జ్యోతి మాట్లాడుతూ వికలాంగులకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని అన్నారు. వీరి అవసరాలకు అనుగుణంగా సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా వారికి నిర్వహించిన ఆటలు, పాటలు పోటీల్లో



వీరఘట్టం: వికలాంగులకు బహుమతులు అందిస్తున్న జిసిడిఒ రోజారమణి

విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎలిమెంటరీ స్కూలు హెచ్ ఎం రోజ్ మేరీ, ఐఇఆర్టీలు జగన్మోహన్ రావు, సిహెచ్. అప్పలనాయుడు పాల్గొన్నారు.

వీరఘట్టం: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ సందర్భంగా జిసిడిఒ కె.రోజారమణి వికలాంగ విద్యార్థులకు వినికిడి వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెడుతుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.కృష్ణమూర్తి, ఐఆర్‌టి ఉపాధ్యాయులు గంగాధర్, కోమటి, రెగ్యులర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వి.అన్నాజీరావు, బి.బాబురావు, సిఆర్‌పిలు, వికలాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలకొండ : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో వికలాంగుల చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. వీరికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను, పోషకాలను ఎంపిపి బొమ్మాళి భాను వివరించారు. మానసిక ధైర్యంతో ముందుకు నడవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డొంక త్రినాధులు, ఎంఇఒ ఎం.సూర్యనారాయణ, ఇఒపిఆర్‌డి సత్యం, ఐఇడి ఉపాధ్యాయులు గడ్డయ్య తదితరులున్నారు.

18 ఏళ్లు నిండితే ఓటు హక్కు తప్పనిసరి

ప్రజాశక్తి- సీతంపేట

18 సంవత్సరాల దాటిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని ఐటిడిఎ పిఒ పీవో బి. నవ్య పిలుపునిచ్చారు. ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా సీతంపేట ప్రభుత్వ ఐ.టి.ఐ కళాశాలలో శనివారం పిఒ అధ్యక్షతన 18సంవత్సరాలు నిండిన ఐటిఐ విద్యార్థులకు ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 124 మంది విద్యార్థులు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నట్లు పిఒ తెలిపారు. 53మంది విద్యార్థులను 17 నుండి 18సంవత్సరాల మధ్య వయస్సులో ఉన్నట్లు గుర్తించి వారిని ప్రోస్పెక్టివ్ ఓటర్లుగా గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.నర సింహమూర్తి, ఐటిఐ ప్రిన్సిపాల్ టివి గిరి పాల్గొన్నారు.



సీతంపేట: మాట్లాడుతున్న పిఒ నవ్య

గుమ్మలక్ష్మీపురం : 18 ఏళ్ల నిండిన ప్రతి యువతి, యువకులు తమ ఓటును నమోదు చేయించుకోవాలని స్థానిక సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు కోరారు. ఈ ఓటు నమోదు కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీఆర్వో బోడెమ్మ, మహిళ పోలీస్ లక్ష్మిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని అన్నారు. డిగ్రీ పాసైన ప్రతి ఒక్కరూ కూడా ఓటు నమోదు చేసుకోవాన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో ఫారం16 అప్లికేషన్ ఇస్తామని అన్నారు.

జియ్యమ్మవలస : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని స్థానిక తహశీల్దార్ డివి సీతారామయ్య పిలుపునిచ్చారు. శనివారం చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటర్లుగా నమోదు కొరకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో 18 ఏళ్ళు దాటిన ప్రతి ఒక్కరికీ ఈ విషయాన్ని విద్యార్థులుగా తెలియజేసి ఓటర్లుగా నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జె. రామారావు, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సుందరంగా తయారైన రహదారి

ఎట్టకేలకు రోడ్డుకు మోక్షం

పాలకొండ : పట్టణంలో రామాకందిర్ నుంచి ఆస్పత్రి వరకు ఉన్న రహదారి నిర్మాణం జరిగింది. ఎన్నో ఏళ్ల నుంచి ఈ రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఏరియా ఆస్పత్రికి వెళ్లే రహదారి కావడంతో పాటు ఎన్.కె.రాజపురం, వెలగవాడ, నీలమ్మ తదితర ప్రాంతాలకు వెళ్లే వారికి ఇదే ప్రధాన రహదారి. నిత్యం వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఎన్నో ప్రభుత్వాలు మారిన ఈ రహదారి పనులు జరగలేదు. చివరికి రూ.70 లక్షలతో ఈ రహదారి పనులు చేపట్టారు.

సచివాలయ సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

సచివాలయాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సచివాలయాల నోడల్ అధికారి కె.రామచంద్రరావు అన్నారు. సచివాలయాలు అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి. చిట్టిబాబు ఆధ్వర్యంలో కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల్లో గల డిజిటల్ అసిస్టెంట్లు, వార్డు విద్యా, డేటా ప్రోసెసింగ్ కార్యదర్శులకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమాన్ని శని వారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ సచివాలయంలో సేవలు పొందేవారి సంఖ్య పెరగాలని, సిబ్బంది అందరూ తప్పనిసరిగా విధులకు హాజరు కావలని అన్నారు. రికార్డులు కచ్చితంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలో నిర్వహిస్తున్న సేవలపై ప్రజలకు వాలంటీర్ ద్వారా అవగాహన పెంపొందించాలని తెలిపారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న నోడల్ అధికారి రామచంద్రరావు

సచివాలయంలోని ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇ - సర్వీస్‌లో బిల్స్ పెండింగ్‌లో ఉండరాదని, ఉంటే వెంటనే చెల్లించాలని అన్నారు. త్వరలోనే నోడల్ అధికారులను నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎడిసి ప్రహ్లద్, ఎస్‌బిసిసిడిసి శ్రీను, ఎపి ఆన్లైన్ డిసి రాజేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒ ప్రసాద్‌కు సన్మానం

పాలకొండ: మండల విద్యాశాఖ అధికారి ఎంవి ప్రసాద్ వీడ్కోలు సన్మాన సభ మండల ఉపాధ్యాయులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అధ్యక్షుడిగా స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జామి రవి, ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ త్రినాధరావు, విశిష్ట అతిథి ఎంఇఒ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేయడం ఉపాధ్యాయ లోకానికి వన్నె తెస్తుందని, శిథిలావస్థలో ఉన్న ఎంఆర్సి సముదాయాన్ని ఉపాధ్యాయ సహకారంతో చక్కగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాసుదేవరావు, సంపత్ కుమార్, పిఆర్టియు మండల అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శుల చంద్రశేఖర్, హేమనీ కుమార్, యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాంతారావు, డి నారాయణరావు, శ్రీరాములు నాయుడు, బి.వి. రమణ, పరంకుసం, నాగరాజు, శివాజీ, రామకృష్ణ, సన్యాసినాయుడు, ఉమామహేశ్వరరావు, పద్మజ, విజయలక్ష్మి, జయప్రదం, జయమని, శశిరేఖ, జయలక్ష్మి, సాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి దేవి విగ్రహావిష్కరణ

పాలకొండ రూరల్ : స్థానిక ఎంఇఒ కార్యాలయంలో పూర్వపు విద్యాశాఖ అధికారి ఎంవి ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు జామి రవి చేతుల మీదుగా శారదా పీఠం విజయనగరం వారిచే సమకూర్చిన సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చదువులు తల్లి సరస్వతీదేవి దీవెనలు అందరికీ అందాలని, మండలంలో విద్యావ్యాప్తి బలోపేతమై అంతా విద్యార్థులు ఉన్నత శిఖరానికి అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో విగ్రహ ప్రతిష్టకు సహకరించిన డి.నారాయణరావు, ఎస్.వాసుదేవరావు, బివి రమణ, యామిని కుమార్, పాల్గొన్నారు.

జోగింపేటలో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగంపేటలో టిడిపి ఆధ్వర్యంలో 'రాష్ట్రానికి ఇదేం కర్మ' అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జ్ బి. చిరంజీవులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలపై పెను భారాలు వేస్తుందన్నారు. ఒక్క అవకాశం ఇవ్వండి అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన వైసిపి రోజురోజుకు సామాన్యులపై భారం వేస్తూ ధరలను విపరీతంగా పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జి. ఉదయభాను, మండల పార్టీ అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, ఆర్ వేణు నాయుడు, బి. సూర్యనారాయణ, పి. నాగభూషణం, బి. లక్ష్మణరావు, బి. వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఇదేం ఖర్మ'ను జయప్రదం చేయాలి

జియ్యమ్మవలస: నియోజకవర్గంలో ఇదేమి ఖర్మ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. శనివారం చినమేరంగిలో శత్రుచర్ల విజయరామరాజు నివాస గృహంలో టిడిపి సమన్వయ కమిటీ



సీతానగరం: నినాదాలు చేస్తున్న టిడిపి నాయకులు

సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల వల్ల ప్రజలు కష్టాలకు గురికావాల్సి వస్తుందని, దీనిపై వారిలో చైతన్యం తీసుకురావడానికి నియోజకవర్గంలో సుమారు 50 పంచాయితీలలో ఇదేమి కర్మ ప్రజలకు కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసేటందుకు టిడిపి శ్రేణులు అంతా కదలాలని ప్రజల్లో ప్రభుత్వం విధానాలను వివరించాలని జగదీశ్వరి కోరారు.

సకాలంలో నాడు-నేడు పనులు పూర్తి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపిడిఒ ఎస్ రమేష్ అన్నారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాలలో చేపడుతున్న నాడు నేడు పనులను తహశీల్దార్ రాధాకృష్ణతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో చేపడుతున్న మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్ పనులను ప్రిన్సిపల్ నాగేశ్వరరావు దగ్గరుండి అధికారులకు చూపించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలరీత్యా నిధులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు అవసరమయ్యే వాటిపై ఖర్చు చేయాలని సూచించారు. కళాశాలకు సరైన మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని నాడు నేడ



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ రమేష్

నిధులు మంజూరు కావడంతో ముఖ్యంగా మరుగుదొడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ నాగేశ్వరరావు తెలిపారు. నాణ్యత లోపాలు లేకుండా పనులన్నీ దగ్గరుండి చేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. సకాలంలో పనులు పూర్తిచేసే విద్యార్థులకు అవసరాలకు అనుకూలంగా మరుగుదొడ్లు ఉండాలని తహశీల్దార్ రాధాకృష్ణ ప్రిన్సిపల్‌కు సూచించారు.

అదనపు బాధ్యతలు తప్పించండి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

పాలకొండ అర్బన్ సచివాలయంలో తమకు అదనపు బాధ్యతలు తప్పించాలని ఎఎన్ఎంలు శనివారం భాసూరువారివీధి సచివాలయంలో ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి భరత్‌భూషణ్‌రాజును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎఎన్ఎంలు 9 మంది ఉండాల్సి ఉండగా ఐదుగురు మాత్రమే ఉన్నామని, దీనివల్ల అదనపు భారం పడుతుందన్నారు. అర్బన్ ప్రాంతమైనప్పటికీ హైరిస్క్ ప్రాంతం ఎక్కువగా ఉండడం వల్ల ఎంసిహెచ్ సేవలు, వివిధ యాప్‌లు నిర్వహణ, ఇంటింటా సర్వేలు వలన ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీనివల్ల పనిభారం ఎక్కువై సకాలంలో పూర్తి చేయలేకపోతున్నామన్నారు. మానసిక ఒత్తిడికి కూడా గురవుతున్నామన్నారు. దీనిపై భరత్‌భూషణ్‌రాజు స్పందిస్తూ డిఎంఅండ్‌హెచ్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్తానని చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో వరలక్ష్మి, దమయంతి, చినతల్లి, భారతి ఉన్నారు.



వినతి పత్రాన్ని అందిస్తున్న ఎఎన్ఎంలు

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ

ప్రజాశక్తి -భామిని

మండలంలోని నులకోజోడులో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు ఎమ్మెల్యే కళావతికి సమస్యలను వివరించగా ఆమె పరిష్కారానికి హామీ ఇచ్చారు. సర్పంచ్ కొత్తూరు ప్రసాద్ రావు, ఎంపిటిసి బూస బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందే తీరుపై ఆరా తీశారు. అనంతరం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు -నేడు పనులను పరిశీలించి, పాఠశాలలో భోజనం, మౌలిక సదుపాయాలు పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంను పరిశీలించి, పిల్లలతో



బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి

ముచ్చటించారు. ఈ కార్యక్రమం వైసిపి కన్వీనర్ తోట సింహాచలం, ఎంపిపి తోట శాంతికుమారి, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, వైసిపి జిల్లా కార్యదర్శి కొవ్వాడ చిరంజీవులు, ఎంపిటిసి టింగ అన్నాజిరావు, సర్పంచ్ మజ్జి మోహన్‌బాబు, గెల్లంకి రమేష్, కాగితపల్లి క్రిష్ణ పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన

సీతంపేట : మండలంలోని మఠ్రిపాడు సచివాలయాన్ని, ఆర్‌బికె కేంద్రాన్ని ఎంపిడిఒ కె.గీతాంజలి శనివారం సందర్శించారు. సచివాలయంలో ఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. గిరిజనులకు సకాలంలో సేవలందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రం ద్వారా ఎలాంటి సేవలు రైతులకు అందించారు, సరిపడా విత్తనాలు వచ్చేయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు.

ఐటిఐలో జాబ్‌మేళా

సీతంపేట : స్థానిక ప్రభుత్వ ఐటిఐలో శనివారం నెల్లూరుకు చెందిన 'గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్' నిర్వహించిన జాబ్ మేళాకు 103 మంది హాజరయ్యారు. దీనిలో 40 మంది పాక్షికంగా ఎంపిక అయ్యినట్లు కంపెనీ మేనేజర్ సైలేస్వర పట్నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియామకం పొందిన వారికి నెలకు రూ.11,500 జీతంతో పాటు, బోజన వసతి, ఇతర అలెవెన్సులు చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టివి గిరి, తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న మేనేజర్ పట్నాయక్

చిన్నారులు, గర్భిణులకు సార్వత్రిక టీకాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో శనివారం 12, 13 వార్డులలో వైద్య సిబ్బంది, సచివాలయాల హెల్త్ సెక్రటరీలు చిన్న పిల్లలకు, గర్భిణులకు సార్వత్రిక టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అదికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు పర్యవేక్షించారు. వ్యాక్సిన్, నమోదు కార్డులను పరిశీలించారు. టీకా సమయ తేదీలను స్పష్టంగా కుటుంబ సభ్యులకు తెలియ పర్చాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం చిన్న పిల్లల్లో శ్వాస కోశ వ్యాధులకు సంబంచిన శాన్స్ ప్రోగ్రాం గురించి అవగాహన కల్పించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలను త్వరితగతిన ఆరోగ్య సర్వే చేసి వివరాలను సాన్స్ యాప్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ పుష్ప, జయగౌడ్, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

జగనన్న కాలనీ లేఅవుట్ పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని వెంకంపేట జగనన్న కాలనీ లేఔట్‌ను శనివారం ఎంపిడిఒ అకిబ్ జావేద్, హౌసింగ్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఇల్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. లబ్ధిదారులకు మెటీరియల్ అందించడంలో జాప్యం పనికిరాదని సిబ్బందికి సూచించారు. ప్రతివారం మండలం ప్రగతి నివేదికను తనకు అందించాలని డిసెంబర్‌లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ జెఇ చంద్రమౌళి, హౌసింగ్ జెఇ చిరంజీవులు, వైసిపి నాయకులు తిళ్ల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.